క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి గురువారం తెలిపారు. అనుమతుల్లేకుండా హంద్రీ నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా వీఆర్వో పాండురంగయ్య ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారైనట్లు తెలిపారు. ఎవరైనా అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోవా, కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం, కారును చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గూడూరు మండలం మల్లాపురం బస్ స్టేజీ వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గోవా, కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంజుల గురువారం తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి పర్లకు చెందిన చింతకాయల రమేష్, మల్లాపురం గ్రామానికి చెందిన బోయ చిన్న మిన్నెల్ల, కల్లూరుకు చెందిన తలారి క్రిష్ణను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 30 గోవా మద్యం బాటిళ్లు, 16 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, మద్యం తరలిస్తున్న కారును సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

లక్ష్య సాధనకు దృఢ సంకల్పం అవసరం


మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి దృఢ సంకల్పం, కేంద్రీకరణ అవసరమని హైదరాబాద్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. గురువారం శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఎస్టీఈ స్టూడెంట్ చాప్టర్ ఏపీ-133 ఆధ్వర్యంలో జరిగిన హౌ టూ చూజ్ ది రైట్ పాత్‌వే అంశంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు ముందుకు సాగేటప్పుడు అనేక సమస్యలు, అవరోధాలు ఎదురవుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని లక్ష్యంపై దృష్టి సారిస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. టిస్లా వంటి ప్రపంచ వ్యాపార దిగ్గజాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఒక పనిపై 20 నిమిషాలు కేంద్రీకరించి, చిన్న విరామం తీసుకుని మళ్లీ కొనసాగిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌డీఓ శేషయ్య పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం


సన్మానిస్తున్న ఏపీడీ, ఉపాధి హామీ సిబ్బంది

ఓర్వకల్లు: ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బదిలీ కానున్న శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీడీ పద్మావతమ్మ, ఏపీఓ సిద్దేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపి లక్ష్యాలను సాధించడం, ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. అలాగే ఇంటింటికి చెత్త సేకరణలో ఓర్వకల్లు మండలాన్ని జిల్లాలో 6వ స్థానంలో నిలిపేలా చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. నంద్యాల జిల్లాలోని అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీస్‌కు బదిలీ అవుతున్న ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ.. లక్ష్య సాధనలో సహకరించిన ఉపాధి హామి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు, క్షేత్రస్థాయి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


గూడూరు ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న పల్‌దొడ్డి వంక


ముడుమాల దారి వద్ద వంకలో కొట్టుకొచ్చిన ఉల్లి దిగుబడులు


వక్కెరవాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

దంచికొట్టిన వాన

- పొంగిన వాగులు, వంకలు
- జనజీవనం అతలాకుతలం
- మునిగిన వరి, పత్తి పంటలు
- కొట్టుకుపోయిన ఉల్లి దిగుబడులు
- వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు


పెంచికలపాడు వద్ద పొంగి ప్రవహిస్తున్న వక్కెర వాగు

కోడుమూరు రూరల్: ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో గురువారం తెలవారుజాము నుంచి సుమారు మూడు గంటల పాటు ఏకదాటిగా గూడూరులో కుంభవృష్టి వాన కురిసింది. భారీ వర్షానికి గూడూరులోని వీధుల్లో మోకాటి లోతుకు పైగా నీళ్లు ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలమైంది. భారీ వర్షానికి గూడూరు ఎస్సీ కాలనీలో పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విలువైన వస్తువులు, వంట సామగ్రి, తిండిగింజలు తడిసిపోయి నష్టపోయినట్లు కాలనీవాసులు వాపోయారు. ఆయా కాలనీల్లో వాననీరు చేరి దెబ్బతిన్న గృహాలను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు.

పొంగిన వక్కెర వాగు– నిలిచిన రాకపోకలు

భారీ వర్షానికి గూడూరు మండలంలోని పెంచికలపాడు వద్ద ఉన్న వక్కెరవాగు పొంగిపొర్లడంతో గూడూరు–కర్నూలు మధ్య వాహనాల రాకపోకలు సుమారు 6 గంటలకు పైగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు కోడుమూరు మీదుగా గూడూరుకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో వాగు ఉధృతి కొంత తగ్గడంతో కర్నూలు–2డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వాగు దాటే క్రమంలో నీటి మధ్యలో నిలిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు కొద్దిసేపు బెంబేలెత్తిపోయారు. వాగు ఉధృతి తక్కువగా ఉండడంతో వారంతా ఎలాగోలా ఒడ్డుకు చేరుకుని ఊపిరి పీల్చుకున్నారు.

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

గూడూరు మండలంలో సుమారు 10 సెం.మీ భారీ వర్షం కురవడంతో చేతికొచ్చిన పత్తి, ఉల్లి, ఇతర కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. ప్రస్తుతం పత్తిని పీకే సమయంలో భారీ వర్షం కురవడంతో చేతికొచ్చిన పత్తి అంతా తడిసిపోయి దెబ్బతిన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

సి.బెళగల్: మండలంలో గురువారం వర్షం దంచికొట్టింది. బుధవారం అర్ధరాత్రి చిన్నపాటి చినుకులు మొదలవగా, గురువారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 9 గంటల వరకు వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లోని వాగులు, వంకలు వరద నీటితో ఉప్పొంగాయి. మండలంలో 47.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంకాధికారి ఆదినారాయణ తెలిపారు.

వాగులో చిక్కుకున్న బస్సు

మండలంలోని పోలకల్ గ్రామం అనంతరం గూడూరు వెళ్లే ప్రధాన రోడ్డుపై జుక్కలోని వాగు వరద నీటితో ఉప్పొంగింది. ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి 54 మంది ప్రయాణికులతో పోలకల్ వైపు వస్తోంది. జుక్కలోని వాగు పొంగి ప్రవహిస్తుండగా దాటి వెళ్లొచ్చన్న భావనతో డ్రైవర్ బస్సును ముందుకు పోనిచ్చాడు. వాగు మధ్యలోకి వెళ్లాక బస్సు వరద నీటిలో చిక్కుకుంది. ఒడ్డున ఉన్న పోలకల్ గ్రామస్తులు వెంటనే స్పందించారు. ట్రాక్టర్ సాయంతో బస్సును బయటకు లాగారు. దీంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

పొంగిన వాగులు, వంకలు

భారీ వర్షానికి వాగులు, వంకలు వరద నీటితో పొంగిపొర్లాయి. సి.బెళగల్ నుంచి పోలకల్ వెళ్లే దారిలో ఇనగండ్ల క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అర్ల వాగు, ముడుమాల దారిలోని పల్‌దొడ్డి వంక, గుండ్రేవుల నుంచి సంగాలకు వెళ్లే దారిలో చిన్న, పెద్ద వంకలు, సంగాల నుంచి తిమ్మందొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో సప్పలమ్మ వత్తు వంక, తిమ్మందొడ్డి అనంతరం నాగులదిన్నె వెళ్లే దారిలోని చిన్నవాగుకు వరదనీరు పోటెత్తింది. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం అనంతరం నీటి ప్రవాహం తగ్గడంతో వంకలపై ఆయా గ్రామాలకు రాకపోకలు సాగాయి. తుంగభద్ర నదికి సైతం వరద నీరు పోటెత్తడంతో గుండ్రేవుల వద్ద నది రెండు దడులను తాకుతూ ఉధృతంగా ప్రవహించింది.

నీట మునిగిన పంటలు

ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లోని పొలాల్లో కోత కోసిన ఉల్లి దిగుబడులు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. అదేవిధంగా గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం గ్రామాల్లోని వరి మడులలో నీరు చేరడంతో చెరువులను తలపించాయి. రోడ్లపై ఆరబెట్టిన ఉల్లి దిగుబడులపై పట్టలు కప్పి ఉంచగా భారీ వర్షానికి కొంతమేర తడిసినట్లు రైతులు వాపోయారు. ఆయా గ్రామాల వంకల దగ్గర ఉల్లి దిగుబడులు పెద్ద ఎత్తున వరద నీటికి కొట్టుకొచ్చాయి. భారీ వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


కె.నాగలాపురంలో నీటమునిగిన పత్తిపంటను చూపుతున్న రైతు నాగేష్


ఈర్లదిన్నె వద్ద వంక పోటెత్తడంతో మునిగిన వరి పైరు



తడకనపల్లె రైల్వే బ్రిడ్జి కింద పొంగి ప్రవహిస్తున్న వర్షపు నీరు, పంట పొలంలో నిలిచిన నీరు

- కల్లూరు: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వాన దంచికొట్టింది. దీంతో గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. తడకనపల్లె రోడ్డులోని రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షంనీరు ప్రవహించడంతో తడకనపల్లె, వామసముద్రం, ఓబులాపురం తండా, నన్నూరు తదితర గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు నీరు తగ్గే వరకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్ల గ్రామంలో చిన్న వంక, పెద్ద వంకలు బ్రిడ్జిపై పొంగి ప్రవహించాయి. దీంతో పర్ల నుంచి కర్నూలు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది

ఉప్పొంగిన వాగులు

పాణ్యం: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు లెక్కల ప్రకారం మండలంలో 25.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేని వర్షంతో పంట పొలాలు నీట మునిగాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మట్టిమిద్దెల కింద ఎవరూ నివసించవద్దని అధికారులు సూచించారు.

కావేరి వాగు పైవంతెనపై వరద నీరు

రసూల్లాపేట–వడ్డుగండ్ల గ్రామాల మధ్య ఉన్న కావేరి వాగుకు భారీ వరద నీరు రావడంతో వంతెనపై మూడు నుంచి నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వడ్డుగండ్ల ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేకపోగా, ఉపాధ్యాయులు కూడా వెనుదిరగాల్సి వచ్చింది. ఇటీవల వాగులో మట్టి పారబోసిన కారణంగా వంతెన కింద నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

- భూపనపాడులో అధిక వర్షం కారణంగా పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో మిరప, ఇతర పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ కాల్వ నిర్మాణ పనుల వల్ల తవ్విన కాల్వల్లో భారీగా వర్షపు నీరు చేరి, కాల్వలు నిండిపోవడంతో ఇళ్ల ముందుకు వచ్చింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- తొగర్చేడు గ్రామానికి చెందిన షేక్ షరీఫాబీకి చెందిన మట్టిమిద్దె కూలిపోయినట్లు ఆర్ఐ రామ్ తెలిపారు.


భూపనపాడు బీసీ కాలనీలో తీసిన గుంతల్లో నిలిచిన నీరు


పాణ్యం: కావేరి వాగు ఉధృతికి నిలిచిన రాకపోకలు


భూపనపాడులో నీటమునిగిన పంట

ప్రజలను మభ్యపెట్టడంలో చంద్రబాబు దిట్ట

- జగనన్న హయాంలో రైతులు ఏనాడూ రోడ్డెక్కలేదు
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ప్రజలను మభ్యపెట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. గురువారం కాటసాని స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండానే అధికారంలోకి వచ్చాక 15 నెలల్లోనే హామీలన్నీ అమలు చేశామని అనంతపురం జిల్లాలో సభలో చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. అధికారంలోకి వచ్చాక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని సభలో ఊదరగొట్టారన్నారు. అయితే ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి పథకాల ఊసే లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అందరికీ అందలేదన్నారు. ఉచిత బస్సు పథకం కేవలం కొన్ని బస్సులకే పరిమితం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలందరికీ నాణ్యమైన చదువులు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి పనులు మొదలు పెట్టామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మేధావులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. అయితే ఆ మెడికల్ కళాశాలలపై చంద్రబాబు కుట్ర పన్నుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో పనులన్నీ ఆపి ఏకంగా పది మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.

రైతుల పరిస్థితిపై చర్చకు సిద్ధమా..

గత వైఎస్సార్‌సీపీ పాలన, ప్రస్తుత 15 నెలల కూటమి ప్రభుత్వ పానలలో రైతుల పరిస్థితులపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని కాటసాని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులు ఏనాడూ రోడ్లపైకి ఎక్కలేదన్నారు. కేవలం 15 నెలల పాలన కాలంలో రైతుల పరిస్థితి ఎలాగుందో రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ఆర్‌డీవోలకు వినతి పత్రమిచ్చామన్నారు. రైతుల కోసం పోరాటం చేయడం తప్పా? అన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీలో పాల్గొనకుండా నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల అభ్యున్నతి కోసం ధరల స్థిరీకరణ తీసుకువచ్చి వారికి అండగా నిలిచామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చిట్టెమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు అక్కిమి హనుమంతురెడ్డి, కేవీ రమణారెడ్డి, సుంకన్న, శివారెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మొదటగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివారు. అనంతరం సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. రెమట నుంచి పర్లకు తాగునీటి పైపులైన్ పాతబడిందని, వెంటనే పరిశీలించాలని ఎంపీటీసీ శేషన్న, సింగిల్ విండో చైర్మన్ శేఖర్ కోరారు. ఉలిందకొండ గ్రామంలో తాగునీటి, డ్రైనేజీ సమస్యలతో పాటు పాఠశాలల్లో ఇబ్బందులు ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ రమణ ప్రస్తావించారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పర్లలో సంక్షేమ వసతిగృహ నిర్మాణం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆ శాఖ అధికారి వెల్లడించారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాలు రాకపోతున్నాయని సభ్యులు ఫిర్యాదు చేయగా, అధికారులు మే–ఆగస్టు నెలల బిల్లులు ఇప్పటికే విడుదలయ్యాయని వివరించారు. అలాగే పొలాల రహదారులు బాగు చేయాలని శేఖర్ కోరారు.

చెన్నరాయునితిప్పకు ఎల్లెల్సీ జలాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే చెన్నరాయుని తిప్పకు ఎల్లెల్సీ జలాలు అందించామని ఎంపీపీ శారద తెలిపారు. పాతికేళ్ల తరువాతే జలాలు వచ్చాయని కొందరు ప్రచారం చేయడం అవాస్తవమని అన్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో వరుసగా నీటిని అందించామని గుర్తు చేశారు. ఉల్లి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1200 గిట్టుబాటు కాదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, మండలాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


బడి పక్కనే ఉన్న గుంతలో పాచిపట్టిన నీరు

బడి పక్కనే ప్రమాదకరంగా గుంత

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని రేమట గ్రామ మండల పరిషత్ పాఠశాల (మోడల్ స్కూల్) ఎదురుగా ప్రమాదకరంగా నీటి గుంత ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో దాదాపుగా 4 అడుగుల మేర నీరు చేరింది. గుంతలో నీరు పాచిపట్టి అపరిశుభ్రంగా మారింది. దోమలు, విషపురుగులు సంచరిస్తున్నాయి. పాఠశాలలో దాదాపు 65 మంది పిల్లలు 1 నుంచి 5 తరగతుల్లో చదువుతున్నారు. 5 – 11 ఏళ్ల పిల్లలు తెలియక నీటి గుంతవైపు వెళితే ఎలా అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారికి పక్కనే గుంత ఉండగా ఒకవైపు పాఠశాల మరోవైపు ప్రార్థనా మందిరం ఉంది. వివిధ పనులపై ప్రధాన రోడ్డుపై వెళ్లే ప్రజాప్రతినిధులు గుంతను చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. శానిటేషన్, ఫాగింగ్ జాడ లేనే లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలి

కర్నూలు(రూరల్): మండల పరిధి దిన్నెదేవరపాడు అంబేడ్కర్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని సీపీఐ కర్నూలు నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించారు. అనంతరం మాట్లడుతూ.. కాలనీలో దాదాపు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. మురుగు నీరు ఇళ్ల ముందే పారుతోందని, భారీ వర్షాలు కురిస్తే నీరు ఇళ్లలోకి చేరుతుందని వాపోయారు. వర్షపు నీరు నిల్వ చేరి మడుగులు ఏర్పడి క్రిములు, కీటకాలు, దోమలు విజృంభిస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. నాయకులు మాణిక్యం, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మడుగు కాదు.. పాఠశాల ఆవరణ!

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మడుగు కాదు. బస్తిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ. వర్షం వస్తే నీరంతా పాఠశాల ఆవరణలో నిలుస్తోంది. దీంతో విద్యార్థులు వర్షం నీటిలో అడుగులు వేస్తూ తరగతులకు వెళ్లాల్సిన పరిస్థితి. – కల్లూరు

